క్లుప్తంగా

ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు ఎంతమంది పింఛన్‌దారులు, గృహనిర్మాణ లబ్ధిదారులు ఉన్నారని ఆరా తీశారు. ఎంతమందికి జాబుకార్డులు ఉన్నాయని, ఎంతమంది పనులకు వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు ఉపాధి హామి పథకంపై అవగాహన కల్పించి, పనులకు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటు నివారణ ఇంజెక్షన్

పాణ్యం: గుండెపోటుకు గురైన వారికి ఉపశమనం కోసం వేసే ఇంజెక్షన్ స్థానిక సీహెచ్‌సీలో అందుబాటులో ఉందని డాక్టర్ రోహిలా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటుకు గురైతే తక్షణమే సీహెచ్‌సీని సంప్రదించాలన్నారు. రూ.40 వేల విలువైన ఇంజెక్షన్ ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ సుకుమార్ శుక్రవారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 33/11 సబ్ స్టేషన్లలో నిర్వహణ, మరమ్మతుల పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. దీంతో సి.బెళగల్ 33/11తోపాటు పోలకల్, గుండ్రేవుల, కొత్తకోట, బురాన్‌దొడ్డి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, రైతులు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి

సి.బెళగల్: మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ రాణెమ్మ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, హౌసింగ్, ఉపాధిహామి, డీఆర్‌డీఏ అధికారులు, గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయా ప్రభుత్వ నిర్మాణ పథకాలపై ప్రభుత్వ లక్ష్యాలను, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలతోపాటు, ఉపాధిహామీ పనుల కల్పన, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి పంపిణీ, డీఆర్‌డీఏ – వెలుగులో పొదుపు మహిళలకు రుణాలు తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులతో నివేదికలను తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మండలంలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులతో పూర్తి చేయించాలని, ప్రజల ఇళ్ల వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యక్తి మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు.

20 మందితో సేవా కమిటీ నియామకం

గడివేముల: మండల పరిధిలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన దుర్గా భోగేశ్వరం ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు 20 మందితో కూడిన సేవా కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ సేవ కమిటీ ఈనెల 25 నుంచి వచ్చేనెల 1 వ తేదీ వరకు పనిచేస్తుందని అధికారులు శుక్రవారం తెలిపారు. శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారన్నారు.

అల్బెండజోల్‌తో నులిపురుగల నివారణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కల్లూరు: అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను హెచ్‌ఎంలోకు అందించారు. ఈనెల 10న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల మందులు వేస్తామన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మనోజ్‌కుమార్, సీహెచ్‌ఓ సురేష్ బాబు పాల్గొన్నారు.

రైతన్నకు ఏదీ భరోసా?

- విత్తనాలు, ఎరువులకు తప్పని పాట్లు
- ప్రభుత్వ రాయితీపై అందని స్ప్రేయర్లు
- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే దిక్కు
- ఖరీఫ్‌లో అందని ప్రభుత్వ పథకాలు
- మొదలైన రబీ.. పెట్టుబడి కోసం రైతన్న తిప్పలు



గడివేముల: కూటమి ప్రభుత్వంలో రైతన్నకు భరోసా కరువైంది. ఖరీఫ్ సీజన్ ముగిసి.. రబీ సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా పెట్టుబడి సాయం ఊసే లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకం హామీ అందనంత దూరంలోనే నిలిచిపోయింది. రాయితీపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లు రైతుల దరిచేరటం లేదు. ఖరీఫ్ సీజన్‌లో కలుపు నివారణ మందు, పంటను ఆశించే పురుగు మందులు పిచికారీ చేసేందుకు కనీసం స్ప్రేయర్లు కూడా ఇవ్వటం లేదు. మొత్తానికి అన్నదాతను కూటమి ప్రభుత్వం ఆదుకోకుండా ఆగం చేస్తోంది. మండలవ్యాప్తంగా రబీలో 18 వేల ఎకరాల్లో సోయాబీన్, జొన్న, మినుము, వరి, పొగాకుతో పాటు వివిధ పంటలను రైతులు సాగు చేశారు. విత్తనాల కోసం, ఎరువుల, పురుగు మందుల కోసం వేలకు వేలు పెట్టుబడి పెట్టారు. కూటమి ప్రభుత్వం నయా పైసా ఇచ్చిన దాఖలాలు లేవు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా బీసీ రైతులకు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్‌లు రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఈ ఏడాది ఇప్పటివరకు రైతులకు ఉపయోగపడే ఎలాంటి పని ముట్లు ఇవ్వలేదు. పంట సాగు సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది.

అన్నదాత సుఖీభవ ఏదీ?

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను ఊరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు అన్ని సందర్భాల్లోనూ ఊదరగొట్టారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమై పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నా ప్రభుత్వం రూపాయి సాయం చేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందటం లేదని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

నాడు ఆరంభంలోనే..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకూడదని చిత్తశుద్ధితో సాయం అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలుగా నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమ చేసేది.

అధిక ధరలకు కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులకు ప్రతి ఏడాది పంట కాలంలో ఎంతగానో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా కనీసం 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేయాలి. గత ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం ఇచ్చేది.

– తలారి చిన్నన్న, రైతు, గడివేముల

అనుమతులు రావాల్సి ఉంది



రైతులకు రాయితీపై ఇచ్చే పరికరాల కోసం ప్రభుత్వ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ప్రస్తుతం రాయితీతో కూడిన ఎలాంటి పథకాలు ఇవ్వటం లేదు. విత్తనాలు, ఎరువులు రాయితీపై విక్రయించాం. ప్రభుత్వం వచ్చిన రాయితీపై పనిముట్లు వచ్చిన అనంతరం రైతులకు తెలియజేస్తాం.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

నాణ్యమైన భోజనం అందించాలి



మోడల్ స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూళ్లను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి, విద్యాప్రమాణాలను పెంచే దిశగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అనంతరం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. భోజనం తయారు సమయంలో శుభ్రతను పాటించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. విద్యా ప్రమాణాల విషయంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ జోషులావాట్ పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం

కోడుమూరు రూరల్: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నాగరాజు కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పుల బాధ తాళలేక ఈనెల 5న గూడూరులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నాగరాజు కుటుంబాన్ని శుక్రవారం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్లే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి రైతు కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ గూడూరు, కోడుమూరు మండలాల కార్యదర్శులు శ్రీనివాసులు, రాజు ఉన్నారు.

శివాలయంలో కాటసాని పూజలు



పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో శుక్రవారం శివాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మస్తాన్, చాంద్ బాషా, కార్పొరేటర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పిన్నీసును మింగిన మూడేళ్ల చిన్నారి



చిన్నారి కడుపులో కనిపిస్తున్న పిన్నీసు (ఎక్స్‌రే చిత్రం)

కర్నూలు (హాస్పిటల్): మూడేళ్ల చిన్నారి తెలియక పిన్నీసు మింగడంతో వైద్యులు చాకచక్యంగా తొలగించి పునర్జన్మ ప్రసాదించారు. శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి.అబ్దుల్ సమద్ వివరాలు వెల్లడించారు. నగరంలోని మూడేళ్ల చిన్నారి వారం రోజుల క్రితం ఇంట్లో పొరపాటున పిన్నీసును మింగడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ పాపకు ఎక్స్‌రే తీయగా కడుపులోని చిన్నపేగులో పిన్నీసు ఇరుక్కుపోయినట్లు గుర్తించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ బాల ప్రవీణ్‌కుమార్ సహకారంతో డాక్టర్ అబ్దుల్ సమద్ ఎండోస్కోపీ ద్వారా పిన్నీసును విజయవంతంగా బయటకుతీశారు. కొంత సేపటి తర్వాత పాప కోలుకోవడంతో అదే రోజు డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ తెలిపారు.

రగ్బీ క్రీడాకారులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ: ఏపీ సబ్ జూనియర్ బాలికల అండర్ – 15 జట్టుకు శిక్షణ కొనసాగుతోంది. శుక్రవారం దిన్నెదేవరపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను జరుగుతున్న శిక్షణను ఒలింపిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పరిశీలించారు. క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే పదవ జాతీయ స్థాయి సబ్ జూనియర్ అండర్–15 రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై స్లాగ్ లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. కర్నూలు నుంచి నంద్యాల వైపు స్లాగ్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

కరెంట్ కోతతో ఇక్కట్లు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో గురువారం రాత్రి కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నంద్యాల నుంచి వచ్చే మెయిన్ లైన్ ట్రబుల్ అవడంతో కరెంట్ కోత ప్రారంభమైంది. రెండుసార్లు కరెంట్ కోతతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఒకవైపు దోమలు.. మరోవైపు ఉక్కపోతతో అల్లాడిపోయారు.

చితికిన అన్నం విద్యార్థులు ఎలా తింటారు

పాణ్యం: మెత్తగా చితికి పోయిన అన్నం విద్యార్థులు ఎలా తింటారని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బత్తిన ప్రతాప్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉడికీ ఉడకని కూరగాయ, చితికి పోయిన అన్నం చూసి విద్యార్థులు ఉలా తింటారని నిర్వాహకులను నిలదీశారు. వారం రోజులుగా మధ్యాహ్న భోజనం సరిగ్గా ఉండడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. కాగా బియ్యం సరిగ్గా లేవని వంట నిర్వాహకులు ఆయనకు వివరించారు. ఇలాంటి బియ్యం మరో 30 బస్తాలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అధికారులు స్పందించి బియ్యం బస్తాలను వెనక్కి పంపి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని కోరారు.

ఎంఈఓ -2 బాధ్యతల స్వీకరణ



రాజేంద్రప్రసాద్ సన్మానిస్తున్న దృశ్యం

గడివేముల: ఎంఈఓ -2గా గడిగరేవుల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ను ఎంఈఓ -1 మేరీ సునీత, మిడుతూరు ఎంఈఓ -2 శ్రీనాథ్, సీఆర్పీలు, కార్యాలయ సి బ్బంది పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

బాధితులకు కాటసాని పరామర్శ



వెంకటరమణను పరామర్శిస్తున్న రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఈనెల 1న శాంతిరామ్ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై పవర్‌గ్రిడ్ కంపెనీకి చెందిన ట్రాక్టర్ ఢీకొని గాయపడిన భోగేశ్వర దేవస్థాన మాజీ సభ్యులు చింత వెంకటరమణ, నంద్యాలకు చెందిన రమేష్‌లను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవర్‌గ్రిడ్ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, గడిగరేవుల సర్పంచ్ రామోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యులు ఉసేన్‌బాషా, గోపాలయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఆర్డీఓ విచారణ



అధికారులను విచారిస్తున్న ఆర్డీఓ సందీప్

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో శుక్రవారం కర్నూలు ఆర్డీఓ సందీప్ భూ సమస్యపై విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన గొల్ల రమేష్‌కు సర్వే నెంబర్ 23 లో 5.07 ఎకరాలు ఉండగా, మండల రెవెన్యూ అధికారుల తప్పిదంతో సదరు భూమిలో 2.18 ఎకరాల భూమి సర్వే నెంబర్ 21 ఉన్నట్లు, మరో 2.87 ఎకరాల భూమిని చుక్కల భూమిగా రెవెన్యూ రికార్డులు, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో సదరు రైతు ఫిర్యాదు మేరకు ఆర్డీఓ శుక్రవారం గ్రామానికి చేరుకుని రైతు అనుభవ భూమి సర్వే నెంబర్‌ను స్వయంగా తెలుసుకున్నారు. భూ రికార్డుల నమోదు అంశాలను మండల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికల అనంతరం బాధిత రైతుకు న్యాయం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. అలాగే సి.బెళగల్ పరిధిలో జరుగుతున్న రీ సర్వే పనులను తనిఖీ చేశారు. ఆర్డీఓ వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, రీ సర్వే డీటీ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం ఉన్నారు.

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలివ్వాలి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: నులిపురుగుల నివారణ కోసం పిల్లలందరి చేత ఆల్బెండజోల్ మాత్రలు మింగించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదేనని ఎంపీడీఓ రాముడు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తన కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు.. వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్‌మాదన్నతో కలిసి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 10న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల చేత వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. డాక్టర్ శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలతో పిల్లలు బాధపడుతుంటారన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగడం ద్వారా నులిపురుగులను నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: ఈ నెల 10 నుంచి మండలంలో చేపట్టనున్న నులిపురుగల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషాలతో కలిసి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించి కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిస్తునది దిన్నెదేవరపాడు రోడ్డులో ఉన్న పార్కు. ఈ పార్కులో ముళ్ల పొదలు పెరగడంతో వృథాగా మారింది. ఈ పార్కును వినియోగంలోకి తెస్తే మహాలక్ష్మినగర్, మిలటరీ క్యాంటిన్ పరిసర ప్రాంతాల్లో కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

దిన్నెదేవరపాడు రోడ్డులోని పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న పార్కు సంక్షేమ భవన్ వెనక ఉన్నది. కొన్ని నెలల కిందట ఈ పార్కు గేటు విరిగి కింద పడింది. దీంతో పార్కు లోపల చెట్లు కింద పడి ఎండిపోయాయి. పార్కు లోపల మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. పార్కు వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ భవన్ వెనుక ఉన్న పార్కులో విరిగిన గేటు

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యవంతులువుతారని నోడల్ ఆఫీసర్ రఘు తెలిపారు. శుక్రవారం గొందిపర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు శరీరంలో ఉంటే ఆకలి మందగిస్తుందన్నారు. కడుపు నొప్పి, రక్త హీనత, విరేచనాలు, వాంతులు, వికారం తదితర అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నులి పురుగులు ఉన్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుందని, మలంలో రక్తం లక్షణలు కనిపిస్తాయన్నారు. వీటి నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఏడాదికి 2 సార్లు పిల్లలతో మింగించాలన్నారు. పిల్లలు గడ్డిలో, బురదలో చెప్పులు లేకుండా నడవరాదన్నారు. కూరగాయలు, పండ్లు శుభ్రంగా కడుక్కొని తినాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రేష్మ, నిరంజన్, సామాజిక ఆరోగ్య అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అందనంత దూరం

- పార్కులు ఉన్నా వసతులు శూన్యం
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న దృశ్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

కల్లూరు: కర్నూలు నగరంలో మొత్తం 52 వార్డులు ఉండగా అందుల్లో 16 వార్డులో పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్‌లో ఉన్నాయి. అర్బన్ వార్డుల్లో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. అయితే అందుకు తగ్గట్టుగా మున్సిపల్ అధికారులు వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.


మారిన జీవనశైలిలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ కనపరుస్తున్నారు. కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి తీసుకోవాలని, కాసేపు ఆహ్లాదంగా గడపాలని భావిస్తున్నారు. ఇందుకు పార్కులను ఆశ్రయిస్తున్నారు. అర్బన్ పరిధిలోని ఆయా కాలనీలలో మున్సిపల్ పార్కులు ఏర్పాటు చేశారు గానీ ఎలాంటి వసతులు కల్పించడం లేకపోవడంతో వృథాగా ఉన్నాయి. కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు, చెట్లు పెరిగాయి. మరికొన్ని పార్కుల్లో మద్యం సీసాలు, చెత్త చెదారంతో నిండి ఉన్నాయి. పార్కులు వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయిని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనంతో నింపాలి. చిన్న పిల్లలకు ఆడుకునే పరికరాలు, యువకులు, పెద్దలు వ్యాయామం చేయడానికి పరికరాలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఆయా కాలనీలో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునే విధంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పార్కులో ఉన్న మద్యం సీసాలు

పార్కును వినియోగంలోకి తేవాలి



కల్లూరు అర్బన్ పార్థసారథి నగర్‌లో ఉన్న పార్కును వినియోగంలోకి తేవాలి. పార్కు మొత్తం చెత్త చెదారం, ఇటుకలతో నిండి ఉంది. కాలనీలో పార్కు ఉన్న వినియోగంలో లేకపోవడంతో ఆహ్లాదం కోసం ఇతర పార్కులకు వెళ్లాల్సి వస్తోంది. పార్కులో పిల్లలు ఆటలాడుకునే పరికరాలతో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, పార్థసారథి నగర్

వసతులు కల్పించాలి



కల్లూరు అర్బన్ పరిధిలోని 21వ వార్డులో ఉన్న పార్కులలో వసతులు కల్పించాలి. వార్డులోని కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు పెరిగాయి. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేస్తే స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయామం చేసుకుంటారు. సంబంధిత అధికారులు పార్కుల్లో వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలి.

– జె.శ్యామ్, 21వ వార్డు